




గొట్టాబ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంశధార

జ్వరాల బారిన జనం

- వాతావరణంలో మార్పులతో ప్రబలుతున్న వ్యాధులు
- ఏ జ్వరమో తెలియక ఆస్పత్రులకు పరుగులు
- లెక్కలోకి రాని ప్రయివేట్ ఆస్పత్రుల్లోని కేసులు
- పరీక్షల పేరుతో జ్వర పీడితుల జేబులు గుల్ల

వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. సాధారణ జ్వరాలతో పాటు టైఫాయిడ్, డెంగీ, మలేరియా కేసులూ నమోదవుతున్నాయి. ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రులకు వస్తున్న రోగుల్లో జ్వర పీడితులే ఎక్కువగా ఉంటున్నారు. పిహెచ్‌సిల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. వైద్యారోగ్యశాఖ అధికారులు పెద్దగా కేసులు లేవని చెప్తున్నా, ప్రయివేట్ ఆస్పత్రులకు వస్తున్న వారు మాత్రం డెంగీ, టైఫాయిడ్, మలేరియా లక్షణాలతో వచ్చి చికిత్స తీసుకుంటున్నారు. ఇదే అదునుగా ప్రయివేట్ ఆస్పత్రులు అధికంగా డబ్బులు వసూలు చేయడంతో, జ్వర పీడితుల జేబులు గుల్లవుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 13 డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయని వైద్యారోగ్యశాఖ అధికారులు చెప్తున్నారు. మలేరియా కేసులు ఏడు వరకు వచ్చాయని అంటున్నారు. ఇవి కేవలం ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారి లెక్కలుగానే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రయివేట్ ఆస్పత్రులు, ఆర్‌ఎంపిల ప్రథమ చికిత్స కేంద్రాలు జ్వర పీడితుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. జ్వరాలు ప్రబలుతుండడంతో అది ఏ జ్వరమో తెలియక చాలామంది రోగులు పరీక్షల కోసం ప్రయివేట్ ల్యాబ్‌లకు వెళ్తున్నారు. ఇదే అదనుగా కేంద్రాల నిర్వాహకులు అయిన కాడికి దండుకుంటున్నారు. వాస్తవంగా డెంగీ నిర్ధారణ చేయాలంటే ఎలీసా పరీక్ష చేయాలి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రిలోనే చేస్తున్నారు. ఇది తెలియక గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేరి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఎలీసా పరీక్షలు ఎక్కడ చేస్తారనే దానిపై అధికారులు విస్తృత అవగాహన కల్పించకపోవడంతో, ప్రజలు ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలోని సమస్యలు గుర్తించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు జర్వాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బూర్జ : పెద్దపేట వెల్‌నెస్ కేంద్రంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

అనధికారికంగా పరీక్షలు

ప్రభుత్వాస్పత్రుల్లోనే పరీక్షలు నిర్వహించాలని పక్కాగా ఆదేశాలు ఉన్నా ప్రయివేట్ ఆస్పత్రులు, లేబొరేటరీలు అనధికారికంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. జ్వరాలతో వస్తున్న వారికి కిట్ పరీక్షలు నిర్వహించి డెంగీగా నిర్ధారిస్తున్నారు. వాస్తవానికి కిట్ పరీక్షల్లో రోగ నిర్ధారణ అంత కచ్చితత్వం కాదని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఒకరు చెప్పారు. ఎలీసా పరీక్షతోనే డెంగీ వ్యాధిని కచ్చితంగా గుర్తించవచ్చని చెప్పారు.

డెంగీ పేరుతో అధిక ఫీజులు

పరీక్షలు ప్రభుత్వాస్పత్రుల్లో చేస్తున్నా, వైద్యం సరిగా అందుతుందా? లేదా? అన్న సందేహంతో ప్రయివేట్ ఆస్పత్రుల్లో చేరుతున్నారు. రోగుల భయాన్నే అవకాశంగా తీసుకుని ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రులు అధిక ఫీజులతో దోపిడీ సాగిస్తున్నాయి. డెంగీ పేరుతో ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రులు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్లేట్‌లెట్స్ కోసం చిన్న చిన్న ఆస్పత్రులు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు తీసుకుంటున్నాయి. పరిస్థితి తీవ్రంగా ఉంటే, కార్పొరేట్ ఆస్పత్రులు రూ.25 వేల వేరకు ఫీజులను కట్టించుకుంటున్నాయి.

గ్రామాల్లో తీరిక లేని ఆర్‌ఎంపిలు

డెంగీతో పాటు ఇతర సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉండడంతో, గ్రామాల్లో ఆర్‌ఎంపిలు తీరిక లేకుండా ఉన్నారు. డెంగీకి కూడా వారే చికిత్స చేస్తున్నారు. ప్లేట్‌లెట్స్ పడిపోయి పరిస్థితి తీవ్రతగా ఉంటే, తమతో సంబంధాలున్న జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రులకు పంపిస్తున్నారు. అప్పటికే చేతిలో డబ్బులు ఖర్చయిపోవడంతో అప్పులు చేసి ప్రయివేట్ ఆస్పత్రులకు ఫీజులు చెల్లిస్తున్నారు.

అపారిశుధ్య పరిస్థితులూ కారణమే

గ్రామాల్లో తీవ్ర అపారిశుధ్య పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు పడుతుండంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. మలేరియా, డెంగీ తదితర వ్యాధుల బారిన పడుతున్నారు. పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో, బల్బు పోయినా వేసుకోలేని దుస్థితిలో నెలకొంది. కొన్నిచోట్ల సర్పంచ్‌లే చేతిమదుపులు పెట్టి అత్యవసరంగా విద్యుత్ దీపాలు వేయిస్తున్నారు. పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో పారిశుధ్య పనులపై పెద్దగా దృష్టిసారించడం లేదు.

సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

డెంగీ, మలేరియా నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి వారం శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజులు పాటు డ్రై డే నిర్వహిస్తున్నాం. ప్రయివేట్ ఆస్పత్రులు సొంతంగా డెంగీ పరీక్షలు నిర్వహించడానికి వీల్లేదు. వారి దగ్గరకు అనుమానిత కేసులు వస్తే నిర్ధారణ పరీక్షల కోసం ప్రభుత్వం ఎంపిక చేసిన ఆస్పత్రులకు పంపాలని ప్రయివేట్ ఆస్పత్రులకు సూచించాం. గ్రామాల్లో డెంగీ లక్షణాలతో బాధపడుతున్న వారు ఎవరైనా ఉంటే గుర్తించి, శాంపిల్స్‌ను పంపించాలని పిహెచ్‌సి వైద్యులకు సూచించాం. పరీక్షలకు అవసరమైన ర్యాపిడ్ కిట్లను ఆయా ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాం.

- పి.వి సత్యనారాయణ, జిల్లా మలేరియా నివారణ అధికారి

వంశధార పరవళ్లు

- గొట్టాబ్యారేజీ వద్ద 42 వేల క్యూసెక్కుల నీరు
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ, ఉపసంహరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార పరవళ్లు తొక్కుతోంది. ఒడిశాలో కురిసిన వర్షాలకు నదిలోకి భారీగా వరదనీరు చేరింది. హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద ఉదయం ఏడు గంటలకు గరిష్టంగా 42,300 క్యూసెక్కుల నీరు వచ్చింది. దీంతో అధికారులు గేట్లు ఎత్తి 43,456 క్యూసెక్కుల నీటిని కిందికి వదిలారు. వంశధార వరద ప్రవాహం 40 వేల క్యూసెక్కులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

ఉదయం పది గంటల తర్వాత క్రమేణా వరదనీరు తగ్గుముఖం పట్టింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో నీటి ప్రవాహం 37వేల క్యూసెక్కులకు తగ్గడంతో, మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. సాయంత్రానికి 29,961 క్యూసెక్కులకు తగ్గింది. వంశధార ప్రాజెక్టు ఇఇ డిఎస్ ప్రదీప్, డిఇ వై అనీల్ కుమార్, ఎఇఇలు కె.ధనుంజయరావు, జి.పరిశుద్ధబాబు, పి.శ్రీవాణి గొట్టాబ్యారేజీ వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. జిల్లాకు వరద ముప్పు ఏమీ లేదని, రేపు ఉదయానికి సాధారణ స్థితికి చేరుకుంటుందని ఇఇ డి.ఎస్ ప్రదీప్ తెలిపారు.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగుల నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యుత్ ఉద్యోగుల దశలవారీ ఆందోళనలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని ఇపిడిసిఎల్ సర్కిల్ కార్యాలయం వద్ద బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను విద్యుత్ ఉద్యోగ సంఘాల జెఎసి జిల్లా చైర్మన్ ఎం.వి గోపాలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. ఉద్యోగులకు నష్టదాయకమైన నిర్ణయాలతో సహనాన్ని పరీక్షిస్తోందన్నారు. సంస్థలో రెగ్యులర్ ఉద్యోగికి ఇస్తున్న వేతనాలను కాంట్రాక్టు కార్మికులకూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1999 నుంచి 2023 మధ్య విద్యుత్ సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు జిపిఎఫ్, పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డిఎలను తక్షణమే విడుదల చేయాలని, విద్యుత్ సర్వీసుల్లో జాప్యానికి లైన్‌మెన్లను, ఇతర ఉద్యోగులను బాధ్యులను చేస్తూ వేతనాల్లో కోతలు విధించడం తగదన్నారు. తక్షణమే ఉద్యోగులకు పిఆర్‌సిని ఇవ్వాలన్నారు. విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు నగదు రహిత వైద్య సౌకర్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు బి.రమేష్ కుమార్, సనపల వెంకటరావు, బి.ఈశ్వరరావు, జి.సురేష్ కుమార్, సిహెచ్.వెంకటేశ్వరరావు, ఆర్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలా అయితే రాజకీయ సన్యాసం చేస్తా

- టిడిపి హయాంలో పోర్టు, హార్బర్‌కు శంకుస్థాపన చేశారా?
- రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పోర్టు గానీ హార్బర్ గానీ వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గలోని ప్రగతి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో ఆరు వేల ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే, జగన్ ప్రభుత్వంలో రూ.16 వేల కోట్ల వ్యయంతో 44 వేల పాఠశాలలకు నాడు-నేడు కింద అభివృద్ధి చేశామన్నారు. టిడిపి హయాంలో వ్యవసాయరంగం 3.54 శాతం, పారిశ్రామిక రంగం 3.17 శాతం వృద్ధి చెందితే వైసిపి ప్రభుత్వంలో వ్యవసాయ రంగం 11.27 శాతం, పారిశ్రామిక రంగం 12.80 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. రాష్ట్రం ఎవరి హయాంలో అభివృద్ధి సాధించిందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని సువిశాల తీర ప్రాంతాన్ని, నదులను గత ప్రభుత్వం ఎందుకు వినియోగించుకోలేకపోయిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.50 లక్షల మందికి, వైద్యరంగంలో 50 వేల మందికి ఉద్యోగాలను వైసిపి ప్రభుత్వం కల్పించిందన్నారు. రాష్ట్రంలో పది వేల కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నట్లు తెలిపారు. టిడిపి హయాంలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పగలరా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి చేయకుండా మళ్లీ అధికారం ఇస్తే అభివృద్ధి చేస్తామని చెప్పడానికి టిడిపి నాయకులకు సిగ్గు కూడా లేదన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 93.50 లక్షలు, పలాస నియోజకవర్గంలో 26,400 ధ్రువపత్రాలను అందించామని చెప్పారు. సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను ఇతర రాష్ట్రాల్లో అమలు చేసేందుకు చూస్తుంటే, ఆ వ్యవస్థలపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. కరోనా సమయంలో సచివాలయ అధికారులు, వాలంటీర్లు ప్రజల వద్దకు వెళ్లి సేవలందించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అవగాహన లేని పవన్ కళ్యాణ్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి కొనసాగుతారని చెప్పారు.



మాట్లాడుతున్న సీదిరి అప్పలరాజు

జీడి రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే

రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు

ప్రజాశక్తి - పలాస

జీడిపిక్కల ధరలు రోజురోజుకూ పడిపోవడంతో, పెట్టిన పెట్టుబడులు రాక ఏం చేయాలో తోచక జీడి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలుగానే భావిస్తున్నామన్నారు. మండలంలోని మాకన్నపల్లిలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న జీడి రైతు సైని సింహాచలం సంతాప సభను బుధవారం నిర్వహించారు. సింహాచలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జీడిరైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ జీడి రైతులను ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. నాలుగేళ్లుగా జీడిపిక్కల ధర తగ్గిపోవడం, జీడి తోటలపై తెచ్చిన రుణం తీర్చలేక జీడిరైతులు ఆత్మహత్యల బాట పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని ప్రభుత్వ హత్యలుగానే భావించి, మృతుని కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించి, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానికంగా పండిన పిక్కలకు ప్రాధాన్యత ఇచ్చి ముందుగా కొనుగోలు చేయాలని, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జీడి బోర్డు ద్వారా పంట అభివద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. సభలో సర్పంచ్ సైని దేశయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు కె.హేమావతి, సాతుపల్లి కృష్ణారావు, కె.ధర్మారావు, కె.వినోద్ కుమార్, బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహనరావు

ఆర్థిక సంఘం నిధుల మళ్లింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామ పంచాయతీలకు చెల్లిస్తున్న ఆర్థిక సంఘం నిధులను బ్యాంకు ఖాతాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొల్లగొడుతోందని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్‌కు పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ ముత్యాలరావు, జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి రాజ్యసభ సభ్యులు కె.రవీంద్రకుమార్ ఆధ్వర్యాన ఢిల్లీలో కేంద్రమంత్రిని బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. పంచాయతీరాజ్ చట్టాన్ని తూట్లు పొడుస్తూ గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేస్తోందన్నారు. నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని, గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం సమాంతర వ్యవస్థను తీసుకొచ్చి సర్పంచ్‌లకు విలువ లేకుండా చేస్తోందన్నారు. అనంతరం పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు.



కేంద్రమంత్రికి ఫిర్యాదు అందజేస్తున్న ఎంపీ

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం

- అందరి బండారం బయటపెడతా
- ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి

టెక్కలి పట్టణంలో ప్రభుత్వాలు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రెవెన్యూ అధికారుల అసమర్థత వల్లే దురాక్రమణకు గురవుతున్నాయని విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్ణకారుల సంక్షేమ సంఘ స్థలం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి ఎలా మారిందని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 22/ఎలో ఉన్న దాన్ని ఇప్పుడు ఎలా తొలగించారని ప్రశ్నించారు. జిల్లా కేంద్రాస్పత్రి పక్కన పంచాయతీ స్థలం ఆక్రమణకు గురైందన్నారు. సర్వే నంబరు 498/ఎలో ఉన్న 95 సెంట్ల స్థలంలో అటవీశాఖ భవనం, అతిథిగృహ నిర్మాణానికి కేటాయిస్తే, అది కూడా ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి మారిందని తెలిపారు. భవానీనగర్ వద్ద కొన్ని సంస్థలు, సంఘ భవనాల నిర్మాణానికి స్థలాలు కేటాయిస్తే వాటినీ ఆక్రమించుకున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయల నగదు చేతులు మారాయని ఆరోపించారు. అసమర్థ అధికారుల బండారం బయటపెడతానని హెచ్చరించారు. తన వద్ద అన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయని, ఎవరినీ విడిచిపెట్టేది లేదన్నారు.

నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధి తప్ప ఈ నాలుగున్నరేళ్లలో ఏం అభివృద్ధి చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. ఆక్రమిత స్థలాల్లో భవన నిర్మాణాలు చేపట్టినా, టిడిపి ప్రభుత్వం వచ్చాక వాటిని కూల్చివేస్తామని చెప్పారు. భావనపాడు పోర్టు విషయంలో టిడిపి ప్రభుత్వం రైతులను సంతృప్తిపరిచి భూములను సేకరించిందని, ఆ విధంగా ప్రస్తుత ప్రభుత్వం మూలపేట విషయంలో వ్యవహరించకపోవడంతో భూములను సేకరించలేకపోయిందని విమర్శించారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, రైతులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. పోలీస్ బందోబస్తు నడుమ అధికారులు మూలపేట పోర్టు నిర్వాసిత గ్రామాల్లో పర్యటించడం సిగ్గుచేటు అని అన్నారు. త్వరలో తాను మూలపేట పోర్టు నిర్వాసిత గ్రామాల్లో పర్యటిస్తానన్నారు. సమావేశంలో టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, బోయిన గోవిందరాజులు, జీరు భీమారావు, మాజీ ఎంపిపి మట్ట సుందరమ్మ, హనుమంతు రామకృష్ణ, మెండ దమయంతి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి

- రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి
- ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వం ముందు తాము ఉంచిన డిమాండ్లలో కొన్ని నెరవేరాయని, మిగిలిన వాటి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు అన్నారు. ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో ఉద్యోగులతో సమావేశమయ్యేందుకు జిల్లాకు బుధవారం వచ్చిన ఆయన స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్, వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాల చెల్లింపు, అన్ని జిల్లాలకు సమానంగా 16 హెచ్‌ఆర్ఎ వంటి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. మరికొన్ని డిమాండ్లను నెరవేర్చుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న నమ్మకం తమకుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఒక నెల ముందుగానే పిఆర్‌సి కమిషన్ వేసిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆరు నెలల జిపిఎఫ్, సరెండర్ లీవులకు సంబంధించి రూ.900 కోట్లు బకాయిలున్నాయని, మహాసభలకు ముందే చెల్లిస్తే బాగుంటుందని చెప్పారు. రాష్ట్రంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని, సిఎఫ్‌ఎంఎస్‌లో వారిని ప్రభుత్వ సర్వీసుల్లో పనిచేస్తున్నట్లు నమోదు చేయడంతో వారు సంక్షేమ పథకాలను కోల్పోతున్నారని చెప్పారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పిఆర్‌సి కంటే ముందే జూనియర్ అసిస్టెంట్, అటెండర్ కేడర్లకు చెల్లిస్తున్న వేతనాలను వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గురుకులాలు, ప్రభుత్వరంగ కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. విజయవాడలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న మహాసభలకు జిల్లా నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి శివారెడ్డి మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు రావడం లేదని, ప్రభుత్వం సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

కక్షిదారులకు ఉచిత న్యాయ సహాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆర్థిక స్తోమత లేని కక్షిదారులకు ఉచితంగా న్యాయసేవలు అందిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల వాదనకు సొంత ఖర్చులతో న్యాయవాదిని పెట్టుకోలేని వారు దీన్ని ఉపయోగించుకోవచ్చని చెప్పారు. డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌లో న్యాయవాదుల చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ కొమరాపు ఆఫీసునాయుడు, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పుట్టా అంజనీకుమార్, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పైడి హర్షవర్ధన్ ద్వారా ఉచితంగా కేసు నడిపిస్తామన్నారు. ఆర్థికస్తోమత లేని వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు శ్రీదేవి, భాస్కరరావు, ఫణికుమార్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, బార్ కౌన్సిల్ స్టేట్ మెంబర్ గేదెల వాసుదేవరావు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పొన్నాడ రాము, న్యాయాధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం

శ్రీకాకుళం : ఆర్‌టిసిలో ప్రయాణించే వారు నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. బస్సులోని ప్రయాణికులు, డ్రైవర్లు, కండక్టర్లకు వీటిపై బుధవారం అవగాహన కల్పించారు. టిక్కెట్ ఛార్జీలను యుపిఐ విధానంతో పాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారానూ చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ మాధవ్, రెండో డిపో మేనేజర్ శర్మ, కోర్ గ్రూప్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఒకటి, రెండు డిపోల సిస్టమ్ సూపర్‌వైజర్లు ఇబ్రహీం, హైమావతి, ఓపిఆర్ఎస్ ఇంచార్జ్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాతాశిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్ హోం రేషన్ కింద సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రారంభించారు. గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాలింతలు, గర్భిణులకు ఇంటి వద్దకే పౌష్టికాహారం అందజేసేందుకు టేక్ హోం రేషన్‌ను ప్రారంభించిందన్నారు. ఎక్కువ మందిలో రక్తహీనత అధికంగా ఉండడం వల్ల కాన్పు సమయంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపిలు గొండు రఘురాం, అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, గార సిడిపిఒ రాధామాధవి, ఎసిడిపిఒ తులసిలక్ష్మి, వైసిపి నాయకులు అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కిట్‌ను పంపిణీ చేస్తున్న జెసి నవీన్

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ టేక్ హోం రేషన్ కింద సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇంటికే అందజేసిన ఈ సరుకులు సక్రమంగా వినియోగానికి నోచుకోలేదన్నారు. అక్రమాలకు తావు లేకుండా ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా సరుకుల పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సంపూర్ణ పోషణ కిట్‌లో 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర లీటరు పామాయిల్, ఐదు లీటర్ల పాలు, రెండు కిలోల చోడిపిండి, కిలో అటుకులు, పావు కిలో బెల్లం, పావు కిలో ఖర్జూరం, పావు కిలో వేరుశనగ చిక్కీలు, 25 కోడిగుడ్లు ఇస్తారని తెలిపారు. ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు రెండున్నర కిలోల బాలామృతం, రెండున్నర లీటర్ల పాలు, 25 గుడ్లు ఇస్తారని, 3 నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనంతో పాటు ఉడకబెట్టిన కోడిగుడ్డు, వంద మిల్లీలీటర్ల పాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ జి.జయదేవి తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోని ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరును అందజేయడమే తన లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని వావిలపల్లిపేట, నందివాడ, నరసాపురం గ్రామాల్లో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాపాక పంచాయతీ వావిలపల్లిపేటలో రూ.54 లక్షలు, నందివాడలో రూ.75 లక్షలు, నరసాపురంలో రూ.69 లక్షలతో తాగునీటి కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన చేపడుతున్నారని పేర్కొన్నారు. తాగునీరు, సాగునీరు, రహదారుల ఏర్పాటు వంటి మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, సర్పంచ్ మజ్జి శైలజ పాల్గొన్నారు.

రేపు డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా

శ్రీకాకుళం అర్బన్ : బదిలీ, ఉద్యోగోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, దీనినికి నిరసనగా ఈ నెల 4న డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 12 నాటికి బదిలీలు, జూన్ 25 నాటికి వివిధ కేడర్ల ఉద్యోగోన్నతి ప్రక్రియ పూర్తయిన క్యాడర్లకు అప్‌డేట్ చేస్తున్నామనే పేరుతో ఇంతవరకు జీతాలు చెల్లించకపోవడం సరికాదన్నారు. బదిలీల ప్రక్రియను యుద్ధప్రాతిపదికన నిర్వహించామని చెప్పిన విద్యాశాఖ... జీతాలు సకాలంలో చెల్లించడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. జీతాలపైనే ఆధారపడే ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వాటర్ పైపుల పంపిణీ


పైపును అందజేస్తున్న హరిబాబు

బూర్జ : పంట పొలాల్లో వాటర్ లెవెల్ తగ్గకుండా, పెరగకుండా చేసుకునేందుకు వీలుగా వాటర్ పైపులు రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని పెద్దపేట పంచాయతీ మదనాపురంలో రైతులకు ఉచితంగా పైపులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే రైతులకు ఉచితంగా మామిడి, జీడి, సపోటా వంటి పళ్ల రకాల మొక్కలను పంపిణీ చేశామని తెలిపారు. రైతులకు అవసరమైన పలు కార్యక్రమాలు తమ ఫౌండేషన్ ద్వారా చేపడతామని చెప్పారు. ఇప్పటి వరకు 1400 పైపులు పంపిణీ చేశామని తెలిపారు. ఏరియా మేనేజర్ మూర్తి, సమన్వయకర్త డి.ఏసు, పెద్దపేట అగ్రికల్చర్ విలేజ్ అసిస్టెంట్ జగదీష్ పాల్గొన్నారు.

బుస కొడుతున్నాయి



- అప్రమత్తతే సరైన మార్గం
- జిల్లాలో పెరుగుతున్న బాధితులు

జిల్లాలో పాముకాటు బాధితులు రోజురోజుకీ పెరుగుతున్నారు. వ్యవసాయ పనుల్లో భాగంగా పొలం పనులకు వెళ్తున్న వారు, పశువుల పెంపకందారుల, ఉపాధి కూలీలు, పెరట్లో ఇంటి సామగ్రి ఉన్న వారు ఎక్కువగా బలైపోతున్నారు. పాముకాటుకు గురవుతున్న వారిలో కొందరు సకాలంలో చికిత్స పొంది ప్రాణాప్రాయం నుంచి బయట పడుతున్నా... కొందరు అవగాహన లేక నాటు వైద్యాన్ని ఆశ్రయించడంతో మృత్యువాత పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఖరీఫ్ పనులకు వెళ్లేవారంతా పాముల నుంచి రణక్ష పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం/పొందూరు

కాటేస్తే ఇలా చేయాలి...

విష సర్పం కాటేస్తే శరీరంపై కోరల గాయాలు స్పష్టంగా కనిపిస్తాయి. నొప్పి తీవ్రంగా ఉంటుంది. నాలుక మందమైనట్లు, గొంతు, కండరాలు బిగుసుకుపోయినట్లు అవుతుంది. కళ్లు స్పష్టంగా కనిపించకపోవడంతో పాటు ఒక్కోసారి స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. వీటిలో ఏ లక్షణాలు గుర్తించినా సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి. సకాలంలో గుర్తించి ఆస్పత్రికి తరలిస్తే చికిత్స అందజేస్తారు. కాటు వేసిన భాగం నుంచి గుండెవైపు రక్తం ప్రసరణ జరగకుండా చూడాలి. గాయమైన చోట కత్తితో కోసి నోటితో రక్తం పీల్చడం సరికాదు. అలా చేస్తే రక్తం పీల్చే వ్యక్తి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

ఎఫ్ఐఆర్ నమోదైతేనే పరిహారం

పాముకాటుతో మృతి చెందిన కుటుంబానికి వైఎస్ఆర్ బీమా అందాలంటే తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదవ్వాలని నిబంధన ఉంది. అన్ని పత్రాలూ సచివాలయంలో సమర్పిస్తే వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. తరువాత వైఎస్ఆర్ బీమా వర్తిస్తుంది.

మృతుల వివరాలు

- పొందూరు మండలం తోలాపిలో నెల 1న పాముకాటుతో లవకుమార్ అనే బాలుడు మృతి చెందారు.
- సోంపేట మండలం మామిడిపల్లికి చెందిన దున్న తులసమ్మ గత నెల 28న పాముకాటుకు గురై మృతి చెందారు.
- పోలాకి మండలం పిరువాడకు చెందిన వెంకటరావు గత నెల 16న రాత్రి 9 గంటలసమయంలో ఇంటి బయటకు వెళ్లారు. విషసర్పం కాటేయడంతో గంటల వ్యవధిలో ప్రాణాలు విడిచారు.
- లావేరు మండలం మురపాకకు చెందిన జలుమూరు ఎర్రయ్య జూన్ 8న పొలం నుంచి ఇంటికి వస్తున్న సమయంలో పాముకాటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు శ్రీకాకుళం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు.
- జూలై 24న జి.సిగడాం మండలం సేతుభీమవరం పంచాయతీ గంగన్నదొరపాలెంకు చెందిన కె.లక్ష్మీనరసమ్మ ఇంట్లో నిద్రపోతున్న సమయంలో పాముకాటు వేసింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు.

వీటిని మరవొద్దు...

పొలాలు వెళ్లేటప్పుడు చెప్పులు ధరించి, చప్పుడు చేసుకుంటూ వెళ్లాలి.
రాత్రి పూట ఎక్కుడికైనా వెళ్తే తప్పనిసరిగా టార్చిలైటు, చేతిలో కర్ర పట్టుకోవాలి.
గడ్డివాములు, ఇంటి మిద్దెలు, రాళ్లు, ఇటుకలు, కపపలు, పొలాల గట్లపై వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి
పశువులశాలలు, ఇళ్ల పరిరాలను శుభ్రంగా ఉంచాలి. పనికిరాని మొక్కలు, చెత్తా చెదారం తదితర వాటిని తొలగించాలి.
పాముకాటుకు గురైన వ్యక్తుల్లో ఎక్కువ మంది భయాందోళనతోనే ప్రాణాలు విడుస్తున్నారు. ఆందోళనకు గురికావడంతో రక్తప్రసరణ పెరిగి విషయం వేగవంగా శరీరమంతా చేరుతుంది. అలా జరగకుండా బాధితుడికి ధైర్యం చెప్పాలి.

అందుబాటులో పాముకాటు మందులు



కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాముకాటుకు సంబందించి ఏంటీ స్నేక్ వీనమ్ మందులు అందుబాటులో ఉన్నాయి. పాము కరిచిన వెంటనే గాయంపై భాగాన కట్టు కట్టి జాగ్రత్తలు పాటించాలి. అందుబాటులో ఉన్న వాహనంతో సకాలంలో ఆస్పత్రికి తరలించాలి. నాటు వైద్యం కాని, సొంత వైద్యం కాని చేయరాదు.

- డాక్టర్ మల్లీశ్వరమ్మ, కింతలి పిహెచ్‌సి, పొందూరు మండలం

దేశ ఔన్నత్యాన్ని చాటిన 'పింగళి'


శ్రీకాకుళం అర్బన్ : జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కమిషనర్ ఓబులేసు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య దేశ ప్రజల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పేలా త్రివర్ణ పతాకాన్ని రూపొందించారని, ఆ పతాకాన్ని నగరంలోని గాంధీ మందిరం స్మృతి వనంలో 105 అడుగుల ఎత్తులో ఎగుర వేయడం ఆనందంగా ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. నగరంలోని అంబేద్కర్ కూడలి నుంచి శాంతినగర్ కాలనీ వరకు జాతీయ జెండాతో బుధవారం ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు స్మృతివనంలో పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా భారతీయుల సార్వభౌమత్వానికి ప్రతీకగా నిలిచే 105 అడుగుల జాతీయ జెండాని ఆవిష్కరించే అవకాశం తనకు దక్కడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.ప్రసాదరావు, జామి భీమశంకర్, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, బరాటం లక్ష్మణరావు, నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్, బాడాన దేవభూషణరావు, వావిలాపల్లి జగన్నాథం నాయుడు, హరికాప్రసాద్ పాల్గొన్నారు.

బలగ : పింగళి వెంకయ్య 147వ జయంతి వేడుకలు స్థానిక బలగ హడ్కో కాలనీలో ఉన్న శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కె.అనిత, పాఠకులు పాల్గొన్నారు.

కవిటి: స్థానిక కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జాతీయ జెండా ఆవశ్యకత, పింగళి వెంకయ్య జీవిత చరిత్రను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. యుకెజి విద్యార్థి వేసిన పింగళి వెంకయ్య వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందుమాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కవిటి : జాతీయ పతాకంతో విద్యార్థులు

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి శాఖాగ్రంథాలయంలో జాతీయ పతాక ఆవిష్కర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా పింగళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో భవిత స్కూల్ ఉపాధ్యాయులు భాస్కర్, లైబ్రరీయన్ కె.రామకృష్ణ, పాఠకులు పాపారావు, నారాయణ, ఉమ, భీమారావు, వంశి పాల్గొన్నారు.

ప్లాంటేషన్ పనులు వేగవంతం

డ్వామా పీడీ చిట్టిరాజు


ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

పచ్చదనాన్ని పెంపొందించేందుకుగాను ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. మండలంలోని రొట్టవలసలో అమృత్ సరోవర్ చెరువు గట్టుపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాంటేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో నాణ్యతకు పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. పని కోరిన ప్రతి జాబ్ కార్డుదారునికీ ఉపాధి చూపించాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలోనూ ఉపాధి పనులు చేపట్టవచ్చునని, ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాల శ్లాబ్‌పై పడిన నీటిని ప్రతి ఒక్కరూ భూమిలోకి ఇంకేవిధంగా నిర్మాణాలను చేపట్టాలని అన్నారు. ఇందుకు ఉపాధి సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిడి పి.రాధ, ఎపిఒ పార్వతి పాల్గొన్నారు.

కెజిబివిలో ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

బూర్జ : మండలంలోని కొల్లివలస కస్తూరిబాగాంధీ విద్యాలయంలో చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమయ్యారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరూ కలిసి బుధవారం సాయంత్రం ఐదు గంటల నుంచి కనిపించడం లేదు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్, టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది ఆందోళన చెందారు. పరిసర ప్రాంతాల్లో గాలించారు. అయినా ఆచూకీ తెలియలేదు. వెంటనే సమగ్ర శిక్షా అభియాన్ అధికాలకు, పోలీసులకు ప్రిన్సిపల్ గాయత్రి ఫిర్యాదు చేశారు అలాగే వారి కుటుంబ సభ్యులకూ ఫోన్‌లో సమాచారం అందించారు. సిఐ ఆదాం, చైల్డ్ లేబర్ అధికారిని నీరజ బుధవారం రాత్రి పది గంటల సమయంలో కొల్లివలస కెజిబివికి చేరుకుని అక్కడ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.

పొరపాటుకు చింతిస్తున్నా..

సిఎంను క్షమాపణ కోరిన సతీష్

నౌపడ : పొరపాటున నోరు జారారని, సిఎం జగన్మోహన్‌రెడ్డికి క్షమాపణ కోరుతున్నానని సంతబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు కోత సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం రాత్రి క్షమించమని వేడుకుంటూ వీడియోని విడుదల చేశారు. తాను అలా మాట్లాడకుండా ఉండవలసిందని అన్నారు. ఏమరపాటులో మాట్లాడిన మాటలకు తరువాత తీవ్ర మనస్తాపానికి గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి సిఎం చేసిన మేలు ఎప్పటికీ ఎవరూ మరువలేరని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షునిగా వివాదాలు పరిష్కరించేందుకు మూలపేట సర్పంచ్ బాబూరావుతో మాట్లాడని వివరిం చారు. ఈ క్రమంలో పొరపాటున కొన్ని అసభ్యకర వ్యా ఖ్యలు దొర్లాయని, ఇకపై అలా జరగదని చెప్పుకొచ్చారు. తన వ్యాఖ్యలు వల్ల పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నొప్పించి ఉంటే తనను మనస్ఫూర్తిగా క్షమించాలని కోరారు.


సన్మాన పత్రాన్ని అందజేస్తున్న విజయ

ఎమ్మెల్సీ దంపతులకు సన్మానం

కవిటి: నమ్మకం, విధేయతకు మారుపేరుగా నిలిచిన నర్తు రామారావుకు ఎమ్మెల్సీ రూపంలో సిఎం జగన్ పట్టం కట్టారని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని నర్తుపుట్టుగలో ఎమ్మెల్సీ రామారావు దంపతులకు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో విలువలకు కట్టుబడి, పార్టీ సిద్ధాంతాలకు లోబడి పనిచేసిన నాయకుడు రామారావు అని కొనియాడారు. అంతకుముందు ఎమ్మెల్సీ దంపతులను ఊరేగింపుగా తీసుకువచ్చిన గ్రామస్తులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి కడియాల పద్మ, నాయకులు కడియాల ప్రకాష్, ఇప్పిలి కృష్ణారావు, బద్రి ప్రకాష్, నర్తు శివాజీ, దట్టి అజయ్, లక్ష్మణరావు, లచ్చయ్య పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

సోంపేట: అంబేద్కర్ ఆలోచన విధానాలను ప్రజల్లో ప్రచారం చేయాలంటే పుస్తక పఠనం తప్పనిసరని జైభీమ్ సేన అధ్యక్షుడు నగిరి మోహనరావు అన్నారు. సోంపేటలోని గ్రంథాలయంలో జైభీమ్ సంస్థ సభ్యులకు అంబేద్కర్ జీవిత చరిత్రతో పాటు పలు పుస్తకాలను బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచన విధానం ప్రజల్లోకి చేరాలంటే ఆయనకు సంబంధించిన పుస్తకాలను సభ్యులు తప్పనిసరిగా చదవాలని సూచించారు కార్యక్రమంలో సభ్యులు ఈశ్వరరావు, మద్రిపాటి పూర్ణచంద్ర పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

పొందూరు: మండలంలోని కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నాడు-నేడు పేరుతో రూ.64 లక్షలతో ఇటీవల అభివృద్ధి చేశారు. కొన్ని పనులను మధ్యలోనే అసంపూర్తిగా కాంట్రాక్టరు వదిలివేశాడు. ప్రధానంగా ఆస్పత్రి ప్రహరీ పూర్తిచేయకుండా వదిలేయడంతో మందుబాబుటు మద్యం సేవిస్తుండడంతో ఆస్పత్రి ఆవరణలో సీసాలను పడేస్తున్నారు. ముఖ్యంగా ఆస్పత్రిలో నైట్ వాచ్‌మేన్ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆవరణంలోకి వెళ్లి మద్యం సేవిస్తుండడంతో పాటు అక్కడ ఉన్న అద్దాలను, నీటి పైపులను, సామగ్రిని పగలుకొడుతున్నారు. దీనిపై గతంలో ఆస్పత్రి సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. దీనిపై పీహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లీశ్వరమ్మను ప్రశ్నించగా, ఆస్పత్రిలో రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి మద్యం సేవిస్తుండడం, సామగ్రిని పగలుకొడుతున్నారని అన్నారు.


ఆస్పత్రి ఆవరణలో పడేసిన మద్యం సీసాలు

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి సురేష్ కుమార్


మాట్లాడుతున్న విజిలెన్స్ ఎస్‌పి సురేష్ కుమార్

శ్రీకాకుళం అర్బన్ : విత్తనోత్పత్తి చేస్తున్న కంపెనీలు, ఆర్గనైజర్లు, డీలర్లు సమన్వయంతో వ్యవహరిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి సురేష్ కుమార్ సూచించారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయశాఖ సంయుక్తంగా విత్తన, ఎరువులు, పురుగుల మందుల డీలర్లకు బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన సీడ్ అందించేందుకు ప్రణాళిక ఉండాలన్నారు. ప్రొడక్షన్ ప్లాన్‌ను సంబంధిత శాఖకు తెలపాలన్నారు. వ్యవసాయంలో విత్తనమే ప్రధానమని, రైతులకు తప్పుతోవ పట్టించేలా డీలర్లు వ్యవహరించవద్దని హెచ్చరించారు. డీలర్లు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయశాఖ జెడి శ్రీధర్ మాట్లాడుతూ ప్యాకింగ్, లేబుళ్లు సక్రమంగా ఉంటేనే రైతులు కొనుగోలు చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సదస్సు నిర్వహించడం ద్వారా డీలర్లకు, రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని అన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు బాధ్యతగా ఉంటూ క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు చేయాలని సూచించారు. ఈ సదస్సులో విజిలెన్స్ డిఎస్‌పి కిరణ్‌కుమార్, డీలర్స్ అసోసియేషన్ సెక్రటరీ వైశ్యరాజు గోవిందరాజులు, అధ్యక్షులు బరాటం నాగేశ్వరరావు, నాగేంద్ర, సకలాబత్తుల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

'జెమ్స్' వైద్య శిబిరానికి విశేష స్పందన

- ఉచితంగా బిపి, సుగర్, ఇసిజి పరీక్షలు
- వినియోగించుకున్న రోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

'ప్రజాశక్తి' 43వ వార్షికోత్సవం సందర్భంగా రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఎచ్చెర్ల మండలం కుశాలపురం ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని 'ప్రజాశక్తి' ఎడిషన్ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరానికి పలు వైద్య విభాగాలకు సంబంధించిన వైద్య నిపుణులు హాజరై రోగులను పరీక్షించారు. గుండెకు సంబంధించి కార్డియాలజిస్టు వైద్యులు కళ్యాణచక్రవర్తి, కంటికి సంబంధించిన సమస్యలను ఆప్తాలజీ వైద్యులు అప్పలకొండ, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ మాధవి వైద్య సేవలను అందించారు. వీరితోపాటు ఎముకలకు సంబంధించి ఆర్థోపెడియేషన్ డాక్టర్ సాయికృపాల్, జనరల్ మెడిషన్ నుంచి డాక్టర్ నాగలక్ష్మి పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన విలువైన మందులను ఉచితంగా ఇచ్చారు. ప్రస్తుతం కళ్లకలక వ్యాధి తీవ్రంగా ఉన్న యాంటీ బయాటిక్ డ్రాప్స్ అందించారు. జర్వాలు, వంటి నొప్పులకు మందులను ఇచ్చారు. గర్భిణులకు కాల్షియం, ఐరన్ సిరప్‌లు, మందులు అందజేశారు. తొలుత బిపి, సుగర్ పరీక్షలను ఉచితంగా చేశారు. గుండెకు సంబంధించి 2డి ఎకో, ఇసిజి పరికరాలతో వైద్య పరీక్షలు చేసి రిపోర్టులను అందించారు. ఆస్పత్రి నుంచి సహాయక సిబ్బందిగా వచ్చిన పల్లవి బిపి, సుగర్ వ్యాధి పరీక్షలను చేయగా, ఫార్మాసిస్టు నాయుడు మందులు అందించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సాగిన శిబిరానికి కుశాలపురం చుట్టు పక్క గ్రామాల ప్రజలు, ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని పలు పరిశ్రమలకు చెందిన కార్మికులు భారీ తరలివచ్చారు. వైద్య పరీక్షల కోసం క్యూలైన్‌లో ఓపికగా ఉండి తమకవసరమైన పరీక్షలు చేయించుకున్నారు. జెమ్స్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.సింహాచలం, ఏరియా మేనేజర్ ఎం.మహేష్, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం పిఆర్‌ఒలు జి.వాసుదేవరావు, రాంబాబు, రాజు పాల్గొన్నారు.


లైన్‌లో వేచి ఉన్న రోగులు


మందులను అందజేస్తున్న నాయుడు


ఇసిజి చేస్తున్న వైద్య సిబ్బంది

స్థల సమస్య పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న దళితులు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కుంటిభద్ర కాలనీలో సామాజిక భవనం స్థల సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం.చక్రవర్తిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుంటుభద్ర కాలనీలో సర్వే నంబరు 91/6 ప్రభుత్వ భూమి 5 సెంట్లు ఉందని, ఈ భూమి 40 ఏళ్ల దళితుల ఆధీనంలో ఉందని అన్నారు. ఇప్పుడు కొంత మంది మండల నాయకులు ఆ స్థలంలో సామాజిక భవనం కట్టేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. అలాగే దళితుల మధ్య తగాదాలు పెట్టేందుకు చూస్తున్నారన్నారు. గతంలో దళితులు అందరు వేరేచోట సామాజిక భవనం కట్టుకునేందుకు పునాదులు వేశారని, ఇప్పుడు అదేచోట ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ఈయనతో పాటు దళితులు రాజు, సురేష్, రమేష్, తులసి, సింహాచలం వాసు, రమణలు ఉన్నారు.

విద్యార్థులకు ప్రశంసలు


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

పలాస : స్థానిక పలాస శ్రీచైతన్య పాఠశాలలో నాసా స్పేస్ సెటిల్‌మెంట్ అవార్డు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గతేడాది పాఠశాలలో నిర్వహించిన స్పేస్ హోటల్ స్పేస్, కాలనీ ప్రాజెక్టుల్లో 20 మంది విద్యార్థులు మూడు ప్రాజెక్టులు ప్రదర్శించారు. అందులో ఆరుగురు విద్యార్థులు ప్రయోగాత్మకంగా చేసిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఎజిఎం సురేష్‌బాబు, రీజనల్ ఇన్‌ఛార్జి రామనాయుడు, కో-ఆర్డినేటర్ బాలరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ రాము, డీన్ కోటేశ్వరరావు, అసోసియేట్ డీన్ షణ్ముఖరావు, జాగారావు, ఎఒ జైబాబు, ప్రైమరీ ఇన్‌ఛార్జి నీలవేణి, నాసా ఇన్‌ఛార్జి ధర్మారావు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు కష్టించి ప్రయోగాత్మకంగా చేసిన ప్రాజెక్టులు ఇంటర్నేషనల్ స్థాయిలో సాయి ప్రియపండా, దున్న జ్యోత్స్న, స్నేహ సాహూ, తిరుమలరెడ్డి రోజాశ్రీ, గిన్ని మనీషా గెలుపొందినందుకు సంతోషంగా ఉందన్నారు.

రేపు ఐటిఐలో కౌన్సెలింగ్

పలాస : పలాస ఐటిఐలో డైరెక్టర్ ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఐటిఐలో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ పైల జవహర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలైన పదో తరగతి మార్కులిస్టు, కుల, బదిలీ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డులతో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు 9492843849కు సంప్రదించాలని కోరారు.

పిఎసిఎస్ చైర్మన్లకు అభినందనలు

కొత్తూరు : మండల పిఎసిఎస్ చైర్మన్‌గా చింతాడ సూర్యనారాయణను ప్రభుత్వం నాలుగోసారి నియమించింది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిణీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి పాతపట్నం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి బుధవారం అభినందనలు తెలిపారు. ఈయన వెంట వైసిపి నాయకులు చింతాడ సత్యం, ఎం.శంకర్ ఉన్నారు.

టెక్కలి : టెక్కలి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా టెక్కలి వైసిపికి చెందిన సత్తారు సత్యంను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి సహకారంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ ద్వారా సత్యంను నియమించారు. ఇందులో భాగంగా సత్యం దువ్వాడ వాణిని, డాక్టర్ కిల్లి కృపారాణిని పూలమాలలతో అభినందించారు. సత్యం నియామకంపై మాజీ ఉప సర్పంచ్ టంకాల బాలగంగాధర్ గుప్త, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ టంకాల పావనీరాణి, యువజన నాయకుడు బర్ల కార్తీక్, ఎంపిటిసి వాకాడ శ్రీధర్‌రెడ్డి అభినందించారు.


కొత్తూరు : పుష్పగుచ్ఛం అందజేస్తున్న సూర్యనారాయణ


టెక్కలి : వాణిని సన్మానిస్తున్న సత్యం

వైసిపిలో గ్రూపుల మధ్య భగ్గుమన్న విభేదాలు

గాంధీ, చింతాడ రవికుమార్ అనుయాయుల మధ్య కొట్లాట


కర్రలతో కొట్టుకుంటున్న గాంధీ, చింతాడ అనుయాయులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి పార్టీలోని రెండు గ్రూపుల మధ్య విభేదాలు ఒక్కసారిగా బుధవారం భగ్గుమన్నాయి. నియోజకవర్గంలో ఇప్పటికే వైసిపిలో నాలుగు గ్రూపులు ఉన్నాయి. ఈ గ్రూపుల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమన్న పరిస్థితులు కొనసాగుతున్నాయి. పార్టీ కార్యక్రమాలను ఎవరికి వారే చేపడుతుండడంతో నియోజకవర్గంలో కార్యకర్తల మధ్య గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలోని బొడ్డేపల్లిపేట రోడ్డులో ఉన్న కార్యాలయాల వద్ద శ్రీకాకుళం-పాలకొండ మెయిన్ రోడ్డుపై సువ్వారి గాంధీ, చింతాడ రవికుమార్ అనుయాయుల మధ్య బుధవారం మధ్యాహ్నం కొట్లాట జరిగింది. వివరాల్లోకి వెళ్తే... గత నెల 31న వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ జన్మదిన వేడుకలు కొర్లకోట రోడ్‌లోని ఓ ప్రయివేటు కల్యాణ మండపంలో నిర్వహించారు. మంగళవారం సోషల్ మీడియాలో చింతాడ రవికి చెందిన కార్యకర్తలు గాంధీ డబ్బులు చెల్లించి జనాలను తీసుకువచ్చారని పోస్టులు పెట్టారు. బుధవారం మధ్యాహ్నం గాంధీ ఆఫీసులో ఉన్న కొందరు యువకులను రవికి చెందిన కార్యకర్తలు, గాంధీకి చెందిన కార్యకర్తలపై దాడి చేశారు. వెంటనే గాంధీకి గ్రూపునకు చెందిన వ్యక్తులకు వాట్సాప్‌లో చూపి ఒక్కసారిగా 500 మంది యువకులు అక్కడకు చేరుకోవడంతో కొట్లాట జరిగింది.

ఈ కొట్లాటలో రవి గ్రూపునకు ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని అందరిని చెదరగొట్టారు. కొద్ది సమయం అయిన తర్వాత మళ్లీ ఆ ప్రాంతానికి అధిక మొత్తంలో గాంధీ గ్రూపునకు చెందిన కార్యకర్తలు మళ్లీ చేరుకోవడం తో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సాయంత్రం కావడంతో శ్రీకాకుళం-పాలకొండ రోడ్డులో కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పక్కనే ప్రయివేట్ స్కూలు ఉండడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారుఉ.బాహబాహీకి దిగడంతో ఆ పార్టీలోని వర్గవిభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. ఇదే విషయమై ఎస్ఐ వై.కృష్ణను వివరణ కోరగా, గాంధీ గ్రూపునకు చెందిన తమ్మినేని వెంకట సూర్యనారాయణను చింతాడ రవి గ్రూపునకు చెందిన గురుగుబెల్లి భాస్కరరావు, చిగురుపల్లి గిరి, బొడ్డేపల్లి శ్రీనివాసరావులపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని తెలిపారు.



డిసిఎంఎస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా గొండు కృష్ణమూర్తి, కార్యదర్శి సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌లు పాల్గొని మాట్లాడారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి ఎక్కువ కాలం చైర్మన్‌గా పనిచేసి అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. గతంలో అంపోలు కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షునిగా పనిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, వైసిపి నాయకులు అంబటి శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, గార ఎంపిపి గొండు రఘురాం పాల్గొన్నారు.

రాయితీలను వినియోగించుకోవాలి

లావేరు : ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బుడుమూరులో 'ఆయిల్ పామ్ మెగా విస్తరణ మహోత్సవం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ మేరకు రైతులకు సబ్సిడీ ద్వారా వచ్చిన డ్రిప్ పరికరాలను అందజేశారు. అనంతరం ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు దన్నాన రాజినాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు, సర్పంచ్ చిట్టిబాబు, ఎంపిటిసి ప్రతినిధి రవికుమార్, పతంజలి ఫుడ్స్ ఆయిల్ పామ్ కంపెనీ ఎజిఎం వి.పట్టాభిరామిరెడ్డి మేనేజర్ రాజమోహన్ పాల్గొన్నారు.



అవగాహన చిన్నరాజులు

టీకాతో వ్యాధి నిరోధకత

జలుమూరు: క్రమం తప్పకుండా టీకా వేయించుకోవడం ద్వారా పలు వ్యాధులను నివారించవచ్చని హెల్త్ సూపర్‌వైజర్ చిన్నరాజులు అన్నారు. మండలంలోని లింగాలవలస, చల్లవానిపేటలోని అంగన్వాడీ కేంద్రాల వద్ద వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతినెలా మొదటి బుధ, శని, రెండో శనివారాలు గర్భిణులకు టీటీ ఒకటి, రెండు ఇంజిక్షన్లను తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. అలాగే అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఏడాదిన్నర వయసు వరకు అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించుకోవాలన్నారు. ఈ టీకా ద్వారా శిశువులో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మోహిని, సంతోషి ఎమ్మెల్ హెచ్‌పి అమ్ములు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో పర్యటన

మెళియాపుట్టి : మండలంలో జాడుపల్లి, జోడూరు, చేపరా, పట్టుపురం తదితర గ్రామాల్లో నియోజవర్గ వైసిపి నాయకులు లోతుగడ్డ తులసీవరప్రసాద్ బుధవారం పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు రామారావు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో రట్టిని సర్పంచ్ శ్యామల, గండేటి చిన్నా, పాడి కృష్ణారావు, పాడి వెంకటేష్, బెజ్జపల్లి ఆనందరావు, నక్క సత్యం, జడ్డేటి కృష్ణ పాల్గొన్నారు.

అలాగే మండలంలో భరణికోట పంచాయతీలోని గిరిజన గ్రామాల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ పర్యటించారు. రోడ్డు అధ్వానంగా ఉన్నాయని పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈయన వెంట టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ, మాలతి శ్రీధర్, పడాల శ్రీను, మడపాల శశిభూషణ్ ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంజీవరావు

విద్య, వైద్యంపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని సాయినగర్ కాలనీ అంగన్వాడీ సెంటర్‌లో చిన్నారులకు విద్య, వైద్యంపై రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కాగితాపల్లి సంజీవరావు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ్ల కలకపై ముఖ్యంగా చిన్నపిల్లలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యం బాగుంటేనే విద్యలో రాణించగలమని అన్నారు. కళ్ల కలక సోకిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. అనంతరం రోటరీ క్లబ్, గేటులో ఉన్న అన్నపూర్ణ మెడికల్ స్టోర్స్ సౌజన్యంతో పలకలు, పెన్సిళ్లు, బాక్సులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుమలత, బాలామణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతానికి కృషి

ఇచ్ఛాపురం : నియోజకవర్గంలో వివిధ రోడ్లు, వంతెన పనులు వేగవంతంగా చేయాలని సీడాప్ ఎపి చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలోని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ బాలునాయక్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే బాహుదా రోడ్డు వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రోడ్లు, భవనాలశాఖ అధికారి ప్రద్యుమ్న కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు స్పందించి పనులు వేగవంతానికి కృషి చేస్తామని చెప్పారని తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

కొత్తూరు : జిల్లాల విభజన తరువాత కొత్తూరు మండలం టెక్కలి రెవెన్యూలోకి మారింది. దీంతో రెవెన్యూ డివిజన్‌కు వెళ్లేందుకు మండల వాసులు ఇబ్బందులు పడేవారు. ఈ విషయంపై వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ఇటీవల ఎమ్మెల్యే రెడ్డి శాంతి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి టెక్కలి ఆర్‌టిసి డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. మేనేజర్ స్పందించి బుధవారం నుంచి టెక్కలి టు కొత్తూరు బస్సును వేశారు. ఉదయం 9.30 గంటలకు టెక్కలిలో బయలుదేరి కొత్తూరుకు 12.30 గంటలకు, కొత్తూరులో ఒంటి గంటకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు టెక్కలి చేరుతుందని స్థానిక ఆర్‌టిసి కంట్రోలర్ వెంకటరావు తెలిపారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

రణస్థలం : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో గర్భిణులకు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ సరుకులను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రాయపురెడ్డిబుజ్జి, జె.ఆర్.పురం సర్పంచ్ భవిరి రమణ, పచ్చిగుళ్ల సాయిరాం, ఐసిడిఎస్ పిఒ ఝాన్సీ పాల్గొన్నారు.

బూర్జ : మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని ఎంపిపి కర్నే దీప ప్రారంభించారు. కార్యక్రమంల టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ కె.గోవిందరావు, జెడ్‌పిటిసి బి.రామారావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గీతారాణి, సర్పంచ్ వెలుగు అనురాధ, వావాం సర్పంచ్ మంజు పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు సంపూర్ణ పోషణ సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ టి.నాగేంద్రకుమార్, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, వైస్ చైర్మన్ బోర బుజ్జి, కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి డి.శార్వాణి, సూపర్ వైజర్లు లత, పి.గంగమ్మ, ఎస్.సరస్వతి, ధనలక్ష్మి, అరుణ, సునీత పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యాన అంగన్వాడీ కేంద్రాలకు సంపూర్ణ పోషణ సరుకులను సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అందజేశారు. ఐసిడిఎస్ అధికారులతో క్షేత్రస్థాయిలో సరుకులు అందిచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పిఒ శోభారాణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నరసన్నపేట : స్థానిక పురుషోత్తంనగర్ అంగన్వాడీ కేంద్రంలో సంపూర్ణ పోషణ సరుకులను సర్పంచ్ బురల్లి శంకర్ పంపిణీ చేశారు. ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ తులసి, నాగవంశం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నందిగాం: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసిడిఎస్ పిఒ బి.ఉమామహేశ్వరి, సర్పంచ్ జె.రమణమ్మలు అన్నారు. నందిగాం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించి టేక్ హోమ్ రేషన్ బ్యాగులను గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి ఎ.విష్ణు, వై.శారదాబాయి, అంగన్వాడీ కార్యకర్తలు మల్లేశ్వరి, సుమతి, ఇందుమతి, ఉమ, చంద్రకళ, ప్రభ పాల్గొన్నారు.

కవిటి: స్థానిక సచివాలయంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు టేక్ హోమ్ సరుకులను పంపిణీ చేశారు. సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇఒ వీరభద్రస్వామి, నాయకులు డి.ధర్మారావు, డి.దుర్యోధన, సూపర్‌వైజర్ లక్ష్మి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలోని టి.శాసనంలో చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, ఈదుపురంలో జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయనమ్మ, 16 వార్డులో వైస్ చైరపర్సన్ భారతీ దివ్య, 20వ వార్డులో కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి సంపూర్ణ పోషణ సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ నాగరాణి, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : స్థానిక అంగన్వాడీ కేంద్రంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి సంపూర్ణ పోషణ సరుకులను పంపిణీ చేశారు. ఐసిడిఎస్ పిఒ శోభారాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం శలగపేట అంగన్వాడీ సంపూర్ణ పోషణ సరుకులను గ్రామ పెద్దలు అప్పారావు, పెరుమళ్లు పంపిణీ చేశారు.

కోటబొమ్మాళి: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సంపూర్ణ పోషణ సరుకులను ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాళింగ కర్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, మండల ప్రత్యేక అధికారి ఎం.లోకనాథం పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని రాకపోకలో సంపూర్ణ పోషణ సరుకులను ఎంపిటిసి-2 చింత రమణమ్మ, లోలుగు సెక్టార్ ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ కె.అన్నమ్మ పంపిణీ చేశారు. కార్యకర్తలు పద్మ, వాణిశ్రీ, రమణమ్మ పాల్గొన్నారు.



రణస్థలం : కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



కవిటి : కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు



టెక్కలి : సరుకులను అందిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రామచంద్రపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం పాల్గొన్నారు. ఇంటింటికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ నిర్వహించిన పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ ప్రతినిధి చల్లా సింహాచలం, వైసిపి నాయకులు గురుగుబెల్లి చలపతిరావు, రౌతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నరసన్నపేట : పట్టణంలోని పెద్దపేట పరిసర వీధుల్లో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు అన్నపూర్ణ రామారావు, సర్పంచ్ బురెల్ల శంకర్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండలంలోని కుశాలపురం కాలనీ, ఇండస్ట్రీరియల్ ఏరియా, నవభారత్ కూడలిలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



ఆమదాలవలస : పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

బదిలీ ఉపాధ్యాయుల జీతాలను చెల్లించాలి

టెక్కలి రూరల్ : ఇటీవల బదిలీపై అయిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ నాయకులు తమ్మినేని వైకుంఠరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎనిమిదేళ్లు సర్వీస్ పూర్తి చేసుకొని బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు జూన్, జూలై నెలల్లో జీతాలు ప్రభుత్వం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అధికారులు నిర్లక్ష్యంతో కుటుంబాలు వీధిలో పడుతున్నమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిలోను, పర్సనల్ లోన్లు, నిత్యవసర సరుకులు, పిల్లల చదువులకు ఫీజులు, వైద్య ఖర్చులు, వడ్డీలకు అప్పులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఆగస్టు నెల అయినా జీతాలు చెల్లించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

కార్యదర్శులు కీలకం

పలాస : సచివాలయ వ్యవస్థలో సెక్రటరీలే కీలకమని, వారు జవాబు దారితనంగా పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ఐ ఇన్స్టిట్యూట్‌లో శ్రీకాకుళం కార్పొరేషన్, పలాస, ఇచ్ఛాపురం మున్సిపాల్టీల సచివాలయ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ఉన్నతమైన ఆశయాలతో పాలలో గొప్ప మార్పులు తీసుకురావాలని సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాల అనుగుణంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ నాగేంద్రకుమార్, ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ యాదము అప్పలస్వామి, శ్రీను పాల్గొన్నారు.



బీమా అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మి

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- పొందూరు

విజయనగరం జిల్లా రాజాం వద్ద ఇటీవల జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందిన పొందూరు పట్టణానికి చెందిన గెంబలి రవి కుటుంబ సభ్యులను సర్పంచ్ రేగడి లక్ష్మి వైఎస్ఆర్ బీమా సొమ్మును అందజేశారు. ప్రమాదం కారణంగా మృతి చెందడంతో రూ.5 లక్షలు వైఎస్ఆర్ బీమాను అందజేస్తుందని అన్నారు. అందులో భాగంగా రూ.10 వేలును తక్షణ సాయం కింద బుధవారం అందజేశారు. మిగిలిన మొత్తాన్ని నామినీ ఖాతాలో జమ అవుతాయని అన్నారు. ఈమెతో పాటు సచివాలయం సిబ్బంది ఉన్నారు.



ఉబాలు వేస్తున్న కూలీలు

కాంపాక్ట్ బ్లాక్‌లో 'లైన్ షోయింగ్'

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన మండలంలోని చేపనపేటలో కేడర్ మోడల్ కాంపాక్ట్ బ్లాక్‌లో మూడు ఎకరాలు విస్తీర్ణంలో లైన్ షోయింగ్ పద్ధతిలో రైతుల చేత నాట్లు వేయించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి మాట్లాడుతూ వరి సాగులో మెరుగైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చునని అన్నారు. అలాగే క్షేత్రస్థాయిలో కాంపాక్ట్ మోడల్ బ్లాక్‌ల్లో రైతులతో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగయ్యేలా మా సిబ్బంది రైతులతో పనిచేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా సీడ్ టు సీడ్ కిట్లను రైతులందరికీ అందిస్తున్నామని తెలిపారు.

'మహాశక్తి'తో మహిళలకు మేలు



ఆమదాలవలస : మాట్లాడుతున్న రవికుమార్

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహాశక్తి పథకంతో మహిళలకు ఎంతో మేలు కలగనున్నదని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని 10వ వార్డు పరిధిలోని హడ్కో కాలనీలో ఇంటింటికీ వెళ్లి మహాశక్తి పథకాలపై మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని తుంగలో తొక్కారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన భవిష్యత్‌కు గ్యారెంటీలోని సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.1,22,000 అందనున్నాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షులు మెట్ట సుజాత, కింజరాపు సుప్రియ, టిడిపి నాయకులు సంపదరావు, మురళి, బోర గోవిందరావు, కొండబాబు, నాగళ్ల మురళీధర్, రాడ విజయ్‌కుమార్, గుడ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పలాస : మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే కాలనీలో నిర్వహించిన మహాశక్తి కార్యక్రమంలో హనుమంతు చిలకమ్మ, జోగ త్రివేణి, డొక్కరి తులసి, బడ్డ లావణ్య, కెల్లి రాధిక, గొల్ల లత ధనలక్ష్మి, హేమలత, మాలతిపాత్రో పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న సర్వేయర్ సుభాష్

ఆక్రమణల పరిశీలన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వంశధార పరిధిలోని పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురం ఎర్ర చెరువు ఆక్రమించి రోడ్డు నిర్మాణంపై అధికార యంత్రాంగంలో కదలిక మొదలైంది. తహశీల్దార్ బి.అప్పారావు ఆదేశాల మేరకు మండల సర్వేయర్ డి.సుభాష్ పరిశీలించారు. ఎర్ర చెరువులో అక్రమంగా రోడ్డు నిర్మించిన వైనం అధికారుల దృష్టికి వచ్చింది. అప్రమత్తమైన అధికార పార్టీకి చెందిన నాయకులు సువ్వలరేవు గడప గడపకులో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో పరిశీలించి నివేదికను తహశీల్దార్‌కు అందజేస్తామని సర్వేయర్ తెలిపారు.



పొందూరు : రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మల్లేశ్వరమ్మ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పి.అవని అన్నారు. లక్కివలసలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. 60 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీల కేంద్రాలను పరిశీలించి గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరంగంస్వామి, ఎంఎల్‌హెచ్ పి.జీరుఅంజలి, సిహెచ్.ఒ.పద్మావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: గ్రామాల్లో 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కింతలి పిహెచ్‌సి వైద్యాధికారి మల్లేశ్వరమ్మ పేర్కొన్నారు. మండలంలోని తోలాపిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు, మంచం పట్టిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి శ్రావణసంధ్య, ఎఎన్ఎం రాజ్యం, గోవిందరావు, హెల్త్ అసిస్టెంట్ దనారావు, ఆశా కార్యకర్తలు సుధ, వసంత, నందెమ్మ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

మణిపూర్ ఘటనపై నిరసన

ప్రజాశక్తి- రణస్థలం

మణిపూర్‌లో మానవ హక్కులను ఉల్లంఘించి మహిళలపై జరిగిన అత్యాచారాలు, హత్యలకు నిరసనగా రణస్థలం మండల పాస్టర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన దళిత మహసభ, ఎస్‌సి, ఎస్‌టి, ముస్లిం మైనార్టీ నాయకులు బుధవారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు డాక్టర్ గంజీఎజ్రా, జ్యోతి పెడ్రిక్, వి.ఎసురత్నం మాట్లాడుతూ మణిపూర్ సంఘటనపై బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యం, రాంబాబు, గోవింద, అప్పన్న, పోతయ్య, పైడిరాజు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

టీకాలు తప్పనిసరి

కోటబొమ్మాళి: వర్షాకాలంలో పశువులకు సోకే ముద్దశర్మ, లంపీ వ్యాధి పశువులకు సోకకుండా వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని కోటబొమ్మాళి పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఊడికలపాడు, దుర్గంపేట, వరహాలమ్మపేట, యరకయ్యపేట గ్రామాల్లో 263 పశువులకు ఉచితంగా బుధవారం వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ టీకాలు నాలుగు మసాలు వయసు పైబడిన దూడలు నుంచి వేసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపిటిసి బొడ్డు అప్పన్న, పశు వైద్య సిబ్బంది కె.ముకుందరావు, నారాయణరావు పాల్గొన్నారు.

నేడు రాయితీపై టమాటాల విక్రయం

పలాస : పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యాన గురువారం మధ్యాహ్నం 2 గంటలకు సబ్సిడీపై కిలో రూ.50లకు పంపిణీ చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ పి.వి.సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక వ్యక్తికి కిలో టమాటా మాత్రమే అందజేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్ఐ ఆర్థికసాయం

సోంపేట : మండంలోని మామిడిపల్లి పంచాయతీకి చెందిన తులసమ్మ పాముకాటుకు ఇటీవల మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న బారువ ఎస్సై చిరంజీవి రూ.5 వేలు బుధవారం గ్రామ పెద్దల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపిటిసి మాధవరావు, గ్రామ పెద్దలు పాటిన కృష్ణమూర్తి, జె.సింహాచలం, ఎస్.దివాకరరావులు ఎస్ఐకి అభినందించారు.



ఎస్ఐకి అభినందనలు తెలుపుతున్న నాయకులు

సచివాలయం సందర్శన

ప్రజాశక్తి- సోంపేట

ఎండలంలోని పలాసపురం సచివాలయాన్ని తహశీల్దార్ సత్యనారాయణ బుధవారం సందర్శించారు ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సర్పంచ్ తడక జోగారావు గ్రామంలో భూ సర్వే సమస్యలను తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో భూ సర్వే వివరాల నమోదులో తప్పులు దొరిలాయని, వాటిని సరిచేయాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ తిరుపతిరావు, సిబ్బంది చిరంజీవి, చంద్రకళ పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- జలుమూరు

విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని అధిగమించేందుకు కృషి చేయాలని డిప్యూటీ డిఇఒ తిరుమల చైతన్య, డైట్ ప్రిన్సిపాల్ ఎం.భారతమ్మ అన్నారు. మండలంలోని పెద్దదూగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీరు విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సబ్జెక్టుల వారీగా చదువు సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఉదయం 9 గంటలకే పాఠశాలల వద్దకు చేరుకుని ప్రేయర్ నుంచి మధ్యాహ్న భోజనం వరకు పాఠశాలలోనే ఉండి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రోజూ మెనూ ప్రకారం వండి వడ్డించడంతోపాటు వంటలు రుచికరంగా, వేడిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ 1, 2 బి.మాధవరావు, ఎన్.వి.ఎస్.ఆర్. ప్రసాదరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



భోజనం అమలు తీరును పరిశీలిస్తున్న తిరుమల చైతన్య

'ఈ-ఆశ' యాప్‌పై శిక్షణ

ప్రజాశక్తి- పోలాకి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉప కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఈ-ఆశ యాప్‌పై వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి డాక్టర్ నల్లి రవికుమార్ బుధవారం అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తల పనితీరును మానిటరింగ్ చేసే ఒక ప్రత్యేకమైన ఆప్ అని అన్నారు. ఆశా కార్యకర్తల విధులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో వినూత్నంగా రూపుదిద్దుకున్న యాప్ ఈ-ఆశ అని అన్నారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, పిహెచ్ఎన్, శేఖర్‌బాబు, లక్ష్మి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.